సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



కొత్త సార్లొస్తున్నారు

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ-2025లో అర్హత పొందిన 680 మంది అభ్యర్థుల జాబితాను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది.

-8లో



వరి రైతు విలవిల

వరి రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు పంటకు తెగుళ్లు సోకడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.170	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 104 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

18,19 తేదీల్లో జాతీయ సదస్సులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో భారత రాజ్యాంగం '75 ఏళ్లు - సాంకేతిక పరిభాష'పై ఈ నెల 18,19 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు రాజకీయ శాస్త్రం ప్రజా పరిపాలన విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, నేషనల్ సెమినార్ లోకల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.ఆర్. సతీష్ బాబు తెలిపారు. భారత ప్రభుత్వ కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ) విద్యా మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్యా శాఖ, న్యూఢిల్లీ, వైవీయూ అకడమిక్ అఫైర్స్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఆచార్యులు, ఉపన్యాసకులు వస్తారని వివరించారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

నందలూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కింపు చేపట్టారు. 30 రోజులు భక్తులు సమర్పించిన నగదు, కానుకలను లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.3,93,869 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా, డీఏపీ అందించాలి

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ కడప జిల్లాలోని రైతుల అవసరాలకు తగినంత యూరియా, డీఏపీ అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి వినతిపత్రం పంపారు. ఈ ఏడాది ఎగువన కురిసిన వర్షాల కారణంగా కేసీ కెనాల్‌తోపాటు ఇతర రిజర్వాయర్లకు నీరు వచ్చిందన్నారు. దీంతో రైతులు ప్రధానంగా వరి, పత్తి, గడ్డి కయ్యలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారన్నారు. పాస్ఫేట్, యూరియా కొంత మేర జిల్లాకు వచ్చినప్పటికీ రైతులకు అందడం కష్టంగా మారిందన్నారు. యూరియా బస్తా రూ. 266తో విక్రయించాల్సి ఉండగా, బయటి మార్కెట్‌లో రూ. 350లపైనే అమ్ముతున్నారని తెలిపారు.

కురులు.. సిరులు



శ్రీ రెడ్డెమ్మతల్లి మూలవిరాట్

భక్తుల కురులు సిరులు కురిపిస్తున్నాయి. రెడ్డెమ్మ తల్లి ఆలయ తలనీలాలు ఎక్కువ ధర పలుకుతున్నాయి. విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. వేలంపాటలో పాటాదారులు పోటాపోటీగా పాల్గొంటున్నారు. అధిక రేటు హెచ్చించి కైవసం చేసుకుంటున్నారు. దేవస్థానానికి ఏటా భారీ ఆదాయం సమకూరుతుండటం విశేషం.

- రెడ్డెమ్మకొండ తలనీలాలకు భారీ డిమాండ్
- చైనాకు ఎగుమతి
- రికార్డు స్థాయిలో వేలం



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: జిల్లాలోనే సంతాన దేవతగా ప్రసిద్ధి పొందిన శ్రీ రెడ్డెమ్మ తల్లి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి చైనాతోపాటు ఇతర దేశాలకు తలానీలాలు ఎగుమతి చేస్తుంటారు. నాణ్యమైన తలనీలాలు ఇక్కడ లభించడమే బయట దేశాల్లో డిమాండ్‌కు కారణం. ఈ నేపథ్యంలో పాటాదారులు పోటాపోటీగా వేలంలో అధిక ధర పెట్టి తలనీలాలు దక్కించుకుంటున్నారు. రెడ్డెమ్మకొండకు వచ్చే భక్తులంతా ఎక్కువగా సంతాన కోసం వచ్చే వారే. అందరూ 22 నుంచి 45 ఏళ్ల వయసులోపు మహిళలే కావడం విశేషం. ఇక్కడి ఆలయ పరిసరాల్లో పంపిణీ చేసే ఆకు పసరును సేవించి.. అమ్మవారి ఎదుట వర పడితే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. కోర్కెలు తీరిన మహిళలతోపాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి భక్తితో తలనీలాలు సమర్పిస్తుంటారు. అందరూ యుక్త వయసులో ఉన్న వారు కావడంతో.. వారి తలనీలాలు ఎంతో నాణ్యమైనవిగా ఉంటాయనేది వ్యాపారుల నమ్మకం. అందువల్ల రెడ్డెమ్మకొండలోని తలనీలాలు ఎక్కువ ధర పలుకుతుంటాయి. దీంతో ఇక్కడి ఆలయంలోని తలనీలాలకు భారీ డిమాండ్ ఉంది.

కిలో తలనీలాలు రూ.60 వేలు



భక్తులు సమర్పించిన నాణ్యమైన పొడవాటి జుట్టు

ప్రస్తుతం తలనీలాలు మార్కెట్లో కిలో రూ.60 వేల వరకు ధర ఉంది. గతంలో కిలో ధర రూ.30 వేలు నుంచి రూ.40 వేల వరకు మాత్రమే ఉండేది. అయితే తలనీలాలకు మార్కెట్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా.. మన దేశంతోపాటు విదేశాల్లోనూ ఒక్కసారిగా ధరలు పెరిగిపోయాయి. దీంతో వ్యాపారులు ఎగబడి తలనీలాల వేలంపాటలో పాల్గొనడం విశేషం.

మంచి డిమాండ్ ఉంది



అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ సారి వేలం పాటల్లో నాలుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పాల్గొనడం ఇందుకు నిదర్శనం. దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా రెడ్డెమ్మకొండ తలనీలాలకు డిమాండ్ పెరిగింది.

– మంజుల, ఈఓ, రెడ్డెమ్మకొండ

ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు

అమ్మవారి ఆలయంలో లభించే తలనీలాలకు విదేశాల్లో అధిక డిమాండ్ ఉండటంతో.. వేలం పాటలు రికార్డు స్థాయిలో పలుకుతుండటం గమనార్హం. దీంతో బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో వేలం పాటలో పోటీ బాగా పెరిగింది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, కర్నూలు, అనంతపురం, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు తరలివస్తారు. గతంలో రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు మాత్రమే వేలం పాట పాడేవారు. ఈ ఏడాది రూ.18.76 లక్షలకు వేలం పాటలో వ్యాపారులు పాడుకొన్నారు.



ఆలయంలో అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

కడప రూరల్: పారా మెడికల్ కోర్సుల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలని వైఎస్సార్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మీడియెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులకు సంబంధించిన శిక్షణ జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేట్, ప్రభుత్వ పారా మెడికల్ శిక్షణా కేంద్రాల్లో ఇస్తారని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, కడప అనే చిరునామాలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏపీఎస్ఏహెచ్‌పీసీ.సీఓ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు 2024కు గాను 'టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు' కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని వైఎస్సార్ జిల్లా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ తెలిపారు. ఆమె మంగళవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత మూడేళ్లలో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారిని పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకొని, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ఏటా రాష్ట్రపతి చేతుల మీదుగా బహూకరిస్తారని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతోపాటు ప్రశంసా పత్రం, రూ.15 లక్షల నగదు అందిస్తారన్నారు. ఈ అవార్డు కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://awards.gov.in ద్వారా జూన్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు (9949298810), జూనియర్ అసిస్టెంట్ టి.నాగయ్య, (9849497011) నంబర్లను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని వివరించారు.

7 నుంచి భవ్య గుజరాత్ యాత్ర



యాత్ర బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ రైల్వే శాఖలో భాగమైన ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భవ్య గుజరాత్ యాత్రను చేపట్టనున్నామని ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా కడప రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యాత్రకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అక్టోబర్ 7 నుంచి 10 రోజులపాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో గరిష్ఠంగా 639 మంది యాత్రికులు పాల్గొనవచ్చన్నారు. ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, సూర్య దేవాలయం, సబర్మతి ఆశ్రమం, సబర్మతి నది తీరం, యునెస్కో వారసత్వ స్థలం రాణి కి వావ్, అలాగే ప్రపంచ ప్రఖ్యాత స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక క్షేత్రాలను ఈ యాత్రలో సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఈ రైలు రేణిగుంట నుంచి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంట చేరుతుందని వివరించారు. ప్రయాణికులకు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, వెజిటేరియన్ భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతోపాటు ప్రతి యాత్రికుడికి ప్రయాణ బీమా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. స్లీపర్ క్లాస్ టికెట్ ధర రూ.18,400.. 3 టైర్ ఏసీ టిక్కెట్ రూ.30,200.. 2 ఏసీ టిక్కెట్ ధర రూ.39,900 గా నిర్ణయించారని తెలిపారు. టికెట్ బుకింగ్ కోసం బి.యేసయ్య (9281495853), కె.పవన్‌కుమార్ (8287932313)లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు భాస్కర్ బాబు, యేసయ్య, ఈరన్న, దుర్గాప్రసాద్, ఇన్‌చార్జి స్టేషన్ మేనేజర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర



సీఆర్‌పీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రదర్శన

కలికిరి: దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని సీఆర్‌పీఎఫ్ డీఐజీపీ అనుపమ్ శర్మ అన్నారు. కలికిరి సీఆర్‌పీఎఫ్ (సీఐఏటీ-3) 12వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వామపక్ష తీవ్రవాదం(ఎల్‌డబ్ల్యూఈ) ప్రాంతాల్లో మోహరించిన దళాలకు కౌంటర్ ఇన్సర్జెన్సీ శిక్షణను అందించడానికి తమిళనాడు రాష్ట్రం అవడిలో 2014 సెప్టెంబరు 15న గ్రూప్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, తరువాత కలికిరిలో ప్రస్తుతం పూర్తి స్థాయి శిక్షణా సంస్థగా ఏర్పాటైనట్లు పేర్కొన్నారు. సైనిక్ సమ్మేళన్ నిర్వహించి కేంద్రంలో జరుగుతున్న వివిధ రకాల శిక్షణ, వసతి, ఇంకా అవసరమైన సదుపాయాలపై వివరించారు. జవాన్‌లతో ముఖాముఖిగా మాట్లాడారు. సీఆర్‌పీఎఫ్ దేశ సేవలో ముందుంటుందని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కలికిరి బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఐఏటీ స్కూల్ కమాండెంట్ రాజేష్‌కుమార్, అధికారులు, జవాన్‌లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి సుస్తీ

కూటమి పాలనలో ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది. 'ఎన్టీఆర్ వైద్య సేవ' (ఆరోగ్య శ్రీ) పథకం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని ప్రకటించిన కూటమి నాయకుల మాటలు నీటి మూటలయ్యాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వహణ కష్టతరంగా మారింది. ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్(ఆషా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉచిత ఓపీ సేవలను నిలుపుదల చేశారు. దీంతో నిరుపేదల ఇంట ఆరోగ్య దీపం వెలిగించే పథకం అంధకారం దిశగా అడుగులు వేస్తోంది.

- నిలిచిపోయిన 'ఎన్టీఆర్ వైద్య' ఉచిత ఓపీ సేవలు
- కూటమి 14 నెలల పాలనలో 4వ సారి నిలుపుదల
- పేదోడికి భారమవుతున్న వైద్య ఖర్చు



కడప రిమ్స్‌లో ఓపీ కోసం బారులు దీరిన రోగులు, వారి సహాయకులు



ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రిలో ఉన్న రోగులు

కడప రూరల్(వైఎస్ఆర్ జిల్లా): 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం అస్తవ్యస్తంగా మారింది. ఈ పథకంలో భాగంగా కార్పొరేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో.. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే ప్రధాన ఉద్దేశం. అయితే ప్రభుత్వం ఈ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఆసుపత్రుల యాజమాన్యాలు 'పెండింగ్ బిల్లులు చెల్లిస్తే గానీ తాము కోలుకోలేము .. పేదలకు ఉచిత వైద్యం అందించలేము' అని తెగేసి చెప్పాయి.

ఉచిత ఓపీ సేవలు బంద్

ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత ఓపీ సేవలను సోమవారం నుంచి నిలిపేశారు. అంటే ఉచిత వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన పేదలు రూ.300లకు పైగా డాక్టరుకు ఫీజు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. సాధారణంగా అయితే ఉచిత వైద్యం అందించే వారికి ఓపీ సేవలు ఉచితంతోనే ప్రారంభం అవుతాయి. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యా లు గత్యంతరం లేక ఓపీ సేవలు నిలుపుదల చేశారు. ఈ నిర్ణయం ఎన్ని రోజులు ఉంటుందో తెలియదు.

పెనుభారం



- 'ఎన్టీఆర్ వైద్య సేవ' పరిధిలో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. అందులో ప్రైవేట్ కార్పొరేట్ (నెట్‌వర్క్) ఆసుపత్రులతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులు కూడా ఉన్నాయి.
- ప్రైవేట్ ఆసుపత్రులు వంద పడకలు, 50 పడకలు గల ఆసుపత్రులు ఉన్నాయి. ఒక రోజుకు వేలాది మంది నిరుపేద రోగులు ఉచిత వైద్యం కోసం నెట్‌వర్క్ ఆసుపత్రులకు వస్తుంటారు. వారికి వైద్య సేవలు అందించాలంటే ఆసుపత్రుల యాజమాన్యానికి ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ ఆసుపత్రులకు ప్రభుత్వం రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక నెలకే ఒక ఆసుపత్రికి రూ.లక్షల్లో ఖర్చు ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బకాయిలను సక్రమంగా చెల్లించలేదు. విడుదల చేసిన నిధుల కన్నా.. ఆసుపత్రుల్లో అందించిన వైద్య సేవలు, అందాల్సిన బిల్లులు అధికంగా ఉన్నాయి.
- ప్రభుత్వ రంగానికి చెందిన ఆసుపత్రుల్లో 'వైద్య సేవ' పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ డెలివరీలు, పెద్దాసుపత్రుల్లో సాధారణ డెలివరీలతోపాటు సర్జరీలు, అలాగే గర్భాశయం తదితర వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య సేవలు అందిస్తారు. ఇందుకు గాను ఒక్కో వ్యాధిని బట్టి వైద్య సేవ ట్రస్ట్ నుంచి బిల్లులు మంజూరవుతాయి. ఆ విధంగా వచ్చిన డబ్బును ప్రోత్సాహకం కింద వైద్యులకు 45 శాతం, ఆసుపత్రుల అభివృద్ధికి 55 శాతం కేటాయిస్తారు. అయితే అధిక సంఖ్యలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారానే దాదాపుగా 95 రకాలకు పైగా వ్యాధులకు ఉచిత వైద్య సేవలు లభించడంతో, ఈ ఆసుపత్రులపైనే పెనుభారం పడనుంది.

'ఆరోగ్య శ్రీ'పై అసూయ

2007-2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. తద్వారా లక్షలాది మంది ఉచిత వైద్యం ద్వారా పునర్జన్మ పొందారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని మరింత బలోపేతం చేశారు. కాగా టీడీపీ ప్రభుత్వం ఎప్పుడొచ్చినా 'ఆరోగ్య శ్రీ' పథకం ఒడిదిడుకులను ఎదుర్కొంటోంది. దీంతో 'ఆరోగ్య శ్రీ' అంటే టీడీపీకి అక్కసు అనే అభిప్రాయం నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలల కాలంలోనే 4వ సారి ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్య సేవలను నిలుపుదల చేశాయి. దీంతో 'ఎన్టీఆర్ వైద్య సేవ' వెంటిలేటర్‌పై ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 'ఎన్టీఆర్ వైద్య సేవ' వివరాలు

- నెట్ వర్క్ ఆసుపత్రుల సంఖ్య మొత్తం : 108
- ప్రభుత్వ ఆసుపత్రులు: 72

ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు

- ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు: 36
- 100 పడకల ఆసుపత్రులు: 4
- 50 పడకల ఆసుపత్రులు: 32
- ఒక ఆసుపత్రికి ఒక నెలకు ఖర్చు: రూ.30 లక్షల నుంచి - రూ.60 లక్షలకు పైగా

ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు

- మొత్తం బకాయిలు: రూ.150 కోట్లు
- వర్తించే వ్యాధుల సంఖ్య: 3,255
- ఒక రోజుకు వచ్చే రోగులు: 2 వేలకు పైగా

పట్టించుకోకపోవడం దారుణం



కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని పట్టించుకోకపోవడం దారుణం. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఉచిత ఓపీ సేవలు బంద్ చేశారు. పాలకుల నిర్లక్ష్యంతో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదు. కూటమి పాలనలో పేదలకు వైద్యం ఖరీదవుతోంది. దాని కోసం అప్పులు చేసి వాటిని చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. పేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వం స్పందించి నెట్‌వర్క్ ఆసుపత్రులకు నిధులు మంజూరు చేయాలి.

–గంగాధర్‌రెడ్డి, అక్కాయపల్లె, కడప

సహకరించండి



నెట్‌వర్క్ ఆసుపత్రుల వారికి రూ.కోట్లలో బిల్లులు అందాలి. సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించాం. పెండింగ్ బకాయిలు విడుదల కాలేదు. దీంతో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారింది. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోషియేషన్ (ఆషా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి ఉచిత ఓపీ సేవలను నిలుపుదల చేశాం. అత్యవసర వైద్య సేవలను యథాతథంగా కొనసాగిస్తాం. – డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు పంచాయతీ గొల్లపల్లికి చెందిన వివాహిత గాయత్రి(30) ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. సదరు మహిళ మంగళవారం పొలం వద్దకు వెళుతూ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకోగా బాధిత కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. ఆత్మహత్యా యత్నానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మదనపల్లె రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఓ వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు తెలిపారు. టూటౌన్ పోలీసులు అతడి మృతిపై విచారించారు. గుర్తు తెలియని వ్యక్తి చుట్టుపక్కల యాచిస్తూ ఉండేవాడని చెప్పడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతిచెందిన వ్యక్తి బ్లూ కలర్ గళ్ల లుంగీ, గోధుమ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని, సంబంధీకులు ఉంటే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

బొలేరో ఢీకొని వృద్ధురాలు మృతి


మృతిచెందిన జయమ్మ

మదనపల్లె రూరల్ : బొలేరో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మంగళవారం కలకడ మండలంలో జరిగింది. కదిరాయనిచెరువు ఎస్టీ కాలనీకి చెందిన పెద్ద రెడ్డెప్ప భార్య జయమ్మ(64) మర్రిపాడు రోడ్డు మార్గంలో పొలం వద్దకు నడిచి వెళ్తోంది. బొంతలవారిపల్లె సమీపంలో బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కలకడ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడిలో వృద్ధురాలికి గాయాలు


రాయచోటి టౌన్ : పిచ్చి కుక్క దాడిలో లక్ష్మమ్మ(50)కు గాయాలయ్యాయి. రాయచోటి – సుండుపల్లె రోడ్డులో జగనన్న కాలనీ వద్ద అదే ప్రాంతానికి చెందిన లక్ష్మమ్మ నడచి వెళ్తుండగా వెనుక నుంచి పిచ్చికుక్క వచ్చి దాడి చేసింది. గాయాలైన ఆమెను స్థానికులు రాయచోటి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు రేబీస్ వ్యాధి టీకాలు వేశారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష


నిందితుడిని జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

నంబేపల్లి : మండలంలోని నారాయణరెడ్డిపల్లె గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన జడపాల వెంకటరమణకు కడప జిల్లా ప్రధానకోర్టు న్యాయమూర్తి సి.యామిని మంగళవారం శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు జడపాల రమణ 2021లో నారాయణరెడ్డిపల్లెకు చెందిన 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ క్రమంలోనే రమణకు జిల్లా ప్రధాన కోర్టు న్యాయమూర్తి మూడేళ్ల జైలుశిక్ష రూ.20 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

కొత్త సార్లొస్తున్నారు



ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డీఎస్సీ–2025 తుది అంకానికి చేరుకుంది. గతంలో నిర్వహించిన పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్ల ప్రామాణికం అధారంగా 680 మంది అర్హుల జాబితా ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. మరో 32 పోస్టులను భర్తీ చేయలేదు.

- ఎంపిక తుది జాబితా విడుదల
- డీఈఓ ఆఫీసు, కలెక్టరేట్ల వద్ద జాబితా ప్రదర్శన
- జిల్లాలో 712 పోస్టులకు 680 మంది ఎంపిక
- 19న కొత్త ఉపాధ్యాయులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్
- ఈ నెల 22 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ?

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లాలో 712 పోస్టులకు ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించింది. ఇటీవల అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను కడప ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తి చేసింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 712 పోస్టులకు గానూ, 680 మందిని ఎంపిక చేస్తూ తుది జాబితా విడుదల చేసింది. మరో 32 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేరంటూ భర్తీ చేయకుండా మిగిల్చింది. గతంలో ఎన్ని పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే అన్నీ భర్తీ చేసేవారు. రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం అభ్యర్థి లేకపోతే ఆ తర్వాత అర్హత ఉన్న అభ్యర్థికి ఆ పోస్టు కేటాయించేవారు. కూటమి ప్రభుత్వం అలాకాకుండా సంబంధిత అభ్యర్థి లేకపోతే అ పోస్టును వదిలేసి తరువాత డీఎస్సీలో భర్తీ చేస్తామని చెబుతోంది. నిరుద్యోగిత పెరిగిన పరిస్థితుల్లో 32 పోస్టులు మిగిల్చడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


డీఈఓ కార్యాలయం వద్ద మెరిట్ జాబితా

కొలువుల్లో చేరే వారికి శిక్షణ...

కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో ఎంపికైన 680 మంది అభ్యర్థులకు ఈ నెల 19న అపాయింట్‌మెంట్ అర్డర్లు ఇవ్వనున్నట్లు సమాచారం. 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఎంపికైన స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్జీటీలకు శిక్షణ అనంతరం వారికి స్థానాలు కేటాయించి పంపనున్నారు. కొత్త ఉపాధ్యాయులంతా దసరా సెలవుల తర్వాత విధుల్లో చేరే అవకాశం ఉంది.

ఎంపికైన జాబితా వివరాలు...

సబ్జెక్టు	నోటిఫైడ్ పోస్టులు	ఎంపిక చేసినవి
ఎస్ఏ సంస్కృతం	01	01
ఎస్ఏ తెలుగు	26	25
ఎస్ ఉర్దూ	07	06
ఎస్ఏ హిందీ	18	18
ఎస్ఏ ఇంగ్లీస్	81	78
ఎస్ మ్యాథ్స్	44	44
ఎస్ఏ మ్యాథ్స్ ఉర్దూ	01	01
ఎస్ఏ పీఎస్	29	29
ఎస్ఏ పిఎస్ ఉర్దూ	03	01
ఎస్ బయాలజీ	52	50
ఎస్ఏ బయాలజీ ఉర్దూ	02	02
ఎస్ఏ సోసియల్ స్టడీ	60	58
ఎస్ఏ ఎస్ఎస్ ఉర్దూ	05	05
ఎస్ఏ పిఈ	82	80
ఎస్జీటి తెలుగు మీడియం	256	254
ఎస్జిటి ఉర్దూ మీడియం	45	28
మొత్తం	712	680

డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్లో జాబితా...



మెగా డీఎస్సీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి తుది ఎంపిక జాబితా rpr://apdre. apcfrr.in నందు అందుబాటులో ఉంచాం. ఈ జాబితాపై సందేహాల నివృత్తికి డీఈఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశాం. వివరాలకు 995973222209, 9948112966 నెంబర్లకు కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలి.
– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వారం రోజులుగా తన సమస్య పట్టించుకోలేదనే మనస్థాపంతో పోలీస్ స్టేషన్ ఎదుట ఓ మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బాధితురాలి వివరాల మేరకు.. మండలంలోని సీటీఎం పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన మల్లికార్జున భార్య యశోద(32) ఏడాది కిందట భర్తతో విడిపోయి పుట్టింట్లో ఉంటోంది. తన భర్త హార్ట్ పేషంట్ కావడంతో వైద్య చికిత్స, ఇంటి నిర్మాణం కోసం, డ్వాక్రా గ్రూపులో రూ.4 లక్షల రుణం తీసుకుంది. భర్తతో విడిపోయే సమయంలో పెద్ద మనుషుల సమక్షంలో అప్పు చెల్లిస్తానని మల్లికార్జున ఒప్పందం చేసుకున్నారు. అయితే అప్పు చెల్లించకపోవడంతో డ్వాక్రా గ్రూపు సభ్యులు యశోదపై ఒత్తిడి తెచ్చారు. రుణం నీవు తీసుకున్నావు చెల్లించాల్సిందేనని పట్టుపట్టారు. తన సమస్యను పరిష్కరించాలని తాలూకా పోలీసు స్టేషన్‌కు వచ్చి యశోద ఫిర్యాదు చేసింది. పోలీసుల ఆ సమస్యను పట్టించుకోకపోవడంతో మనస్థాపం చెంది తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ యశోదను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ బాధితురాలు యశోద ఎనిమిది నెలల క్రితం భర్తతో విడిపోయి మరో వ్యక్తితో సహజీవనం చేస్తోందన్నారు. ఆమె భర్త పిల్లలను పోషిస్తూ అప్పులు చెల్లిస్తూ, గుండె వైద్యం చేయించుకుంటున్నారన్నారు. ప్రస్తుతం అతడి భార్య యశోధ గ్రామంలోని ఇంటిని సైతం ఆమె పేరుపై మార్చి ఇవ్వాలని, పెద్ద మనుషులను తీసుకుని తాలూకా స్టేషన్‌కు వచ్చిందన్నారు. ఇది సివిల్ సమస్య కావడంతో కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. వారం రోజులుగా స్టేషన్‌కు వచ్చినట్లు చెప్పడం అవాస్తమన్నారు.


బాధితురాలిని పరామర్శిస్తున్న సీఐ కళా వెంకటరమణ

తైక్వాండో జిల్లా జట్టుకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో మంగళవారం ఎస్జీఎఫ్ఐ అండర్–14, 17 బాల బాలికల జిల్లా స్థాయి తైక్వాండో ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఎస్జీఎఫ్ఐ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, జార్జికారొనేషన్ క్లబ్ కార్యదర్శి మార్తల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాల గంగిరెడ్డి, ఈసీ మెంబర్ రామసుబ్బారెడ్డి, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట మురళీమోహన్, శివారెడ్డి, శివకృష్ణ, అల్లాబకాష్, రాఘవ తదితరులు పర్యవేక్షించారు.


అండర్–14 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలలు

దేవస్థానం సిబ్బంది చేతివాటం

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణంలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కెవి.కొండయ్యను చేతివాటం ప్రదర్శించినట్లు ఆలయ ఈఓ రమణారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు... ఈ నెల 16న ఉదయం 12.10 గంటల సమయంలో కొండయ్య ఆఫీస్‌కు వచ్చి కొంతమేర బంగారు, వెండి ప్యాంటు జేబులో పెట్టుకొని పోతుండగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ సెక్యూరిటీ అరవింద్‌కుమార్, నైట్ వాచ్‌మెన్ వెంకటసాయికుమార్ గుర్తించి కొండయ్యను అదుపులోకి తీసుకుని తమకు సమాచారం అందజేశారన్నారు. ఈ విషయమై విచారణ జరపగా బంగారు 31.200 గ్రాములు, వెండి 86 గ్రాములను కొండయ్య చోరీచేసినట్లు తేలిందన్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొండయ్యను విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.

అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు : మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలె బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో సివిక్స్ గెస్ట్ లెక్చరర్ల పోస్టుకు ఈ నెల 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నాగేశ్వరి తెలిపారు. అభ్యర్థులు ఎంఏ పొలిటికల్ సైన్స్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తీర్ణులై బీఈడీ పూర్తి చేసిన మహిళలై ఉండాలన్నారు. డెమో ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు.

తెలుగుగంగ కాలువలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామ సమీపంలోని అంకాలమ్మ గుడి దగ్గరలోని తెలుగు గంగ ఎడమ కాలువలో మంగళవారం స్నానానికి వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు టౌన్ గణేష్‌నగర్‌కు చెందిన ఆరవేటి సుబ్రహ్మణ్యం (32) కలసపాడులో గత కొద్ది రోజులుగా ఓ బేల్దారి వద్ద స్లాబ్ పనులు చేసేందుకు వచ్చాడు. మంగళవారం పని లేకపోవడంతో పుల్లారెడ్డిపల్లె సమీపంలోని తెలుగు గంగ కాలువలో దుస్తులు ఉతికేందుకు కాలువలో దిగాడు. నీటి ఉధృతి ఎక్కువ కావడంతో ఒడ్డుకు చేరుకోలేకపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుని తల్లి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

28న పాటల పోటీలు

రాజంపేట రూరల్ : దివంగత గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి వేడుకను ఘనంగా నిర్వహించనున్నట్లు కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కళాంజలి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక భారతీయ విద్యానికేతన్ (బీవీఎన్) స్కూల్ ప్రాగణంలో జరిగే వేడుకల్లో లలిత, జానపద పాటలతోపాటు తెలుగు సినిమా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు వరుస బహుమతులుగా రూ.3వేలు, రూ.2వేలు. రూ.1000, శాశ్వత షీల్డ్, ప్రశంసా పత్రం అందించనున్నట్లు వివరించారు. ఔత్సాహకులు, కళాకారులు, గాయని, గాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు 9490884300, 9490443000 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పీటీఎం మండలం కొలిమివారిపల్లెకు చెందిన రాధమ్మ(48), తన కుమారుడు పవన్ కుమార్(23)తో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. మార్గమధ్యంలో బి.కొత్తకోట మండలం సదుం క్రాస్‌వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. గాయాలైన వారిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా మదనపల్లె పట్టణం మేదరవీధికి చెందిన శ్రీకాంత్(28) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు. పట్టణంలోని మార్చురీవీధి మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహిళను మోసం చేసిన నిందితుడికి జీవిత ఖైదు

ఓబులవారిపల్లె : రాళ్లచెరువుపల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల మహిళను మోసగించినందుకు పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొండ్ల విజయ్‌కుమార్‌కు జీవిత ఖైదు, రూ.80 వేల జరిమానా విధించినట్లు మంగళవారం ఎస్ఐ పి.మహేష్‌నాయుడు తెలిపారు. రాళ్లచెరువుపల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల మహిళను ఎనిమిది నెలల గర్భవతిగా ఉన్న సమయంలో నమ్మించి పెద్దల సమక్షంలో సిద్దులయ్య స్వామి దేవాలయం వద్ద వివాహం చేసుకున్నాడని, అప్పటికే విజయ్‌కుమార్‌కు భార్య ఉన్న విషయం బయట పడడంతో ఆ మహిళ ఓబులవారిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. అప్పటి ఎస్ఐ డాక్టర్ నాయక్ కేసు నమోద చేయగా ఏడీజే న్యాయమూర్తి ఎస్ రమేష్ కుమార్ నిందితుడికి జీవిత ఖైదు, రూ.80 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కడప అర్బన్ : కడప నగరంలో సోమవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక మహిళ మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు.. ఖాజీపేట మండలానికి చెందిన ఆదిలక్ష్మమ్మ (60) కడపకు వచ్చి తిరిగి బైక్ లో ఖాజీపేటకు వెళ్తోంది. రెండో గాంధీ బొమ్మ వద్దకు రాగానే కడప– ప్రొద్దుటూరుకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇరువురు గాయపడ్డారు.. వారి వివరాలు తెలియాల్సి వుంది.

కడప బిల్టప్ సర్కిల్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో కడప మాసాయిపేటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. మైదుకూరు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న వారిని కడపకు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు సోమవారం రాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగమణికంఠకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి


మృతి చెందిన కళ్యాణ్


విలపిస్తున్న కుటుంబీకులు

బి.కొత్తకోట : సరదాగా ఆడుకునే పసివాడిని నిర్మాణంలోని ఇంటి సంపు రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం బి.కొత్తకోట పట్టణం పిటిఎం రోడ్డులో జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. పెద్దతిప్పసముద్రం మండలం సామాడపల్లెకు చెందిన కె.ఈశ్వరప్ప కొన్నేళ్ల క్రితం బి.కొత్తకోటకు వలస వచ్చి పండ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న వీధిలో నాలుగో తరగతి చదువుతున్న ఈశ్వరప్ప కుమారుడు కే.కళ్యాణ్ (9) మంగళవారం దేవాన్ష్, నాను తదితర పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. అదే వీధిలో ఓ ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండడంతో అక్కడి సంపుపై మూత వేయకుండా వదిలేశారు. పిల్లలు ఆడుకుంటూ ఉండగా..కళ్యాణ్ కనిపించలేదు. దీంతో విషయాన్ని కుటుంబీకులకు తెలియజేశారు. ఆందోళనతో కళ్యాణ కోసం వెతగ్గా సంపులో పడి వుండగా గుర్తించి బిడ్డను తీసుకొని ఆసుపత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ సంపులో పడి ఊపిరాడక చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు కళ్యాణ్ మృతి విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు, ప్రజలు ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. ఈశ్వరప్పకు కుమార్తె కల్పన (13), కుమారుడు కళ్యాణ్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో డిగ్రీ విద్యార్థి..


సుచిత్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : అనుమానాస్పద స్థితిలో డిగ్రీ విద్యార్థి మృతిచెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. శానిటోరియం కొత్తపల్లెకు చెందిన సందీప్, రుక్మిణి దంపతుల కుమారుడు సుచిత్(20) పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీసీఏ చదువుతున్నాడు. తండ్రి సందీప్ ఎనిమిదేళ్ల కిందట చనిపోగా, తల్లి రుక్మిణి వేరొకరిని పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. దీంతో సుచిత్, అవ్వ సుగుణమ్మతో కలిసి శానిటోరియం కొత్తపల్లెలో ఉంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి వరకు ఫోన్ మాట్లాడి నిద్రపోయిన సుచిత్ ఉదయం బాత్ రూమ్‌లో చీరతో ఉరివేసుకున్నాడు. అవ్వ సుగుణమ్మ గమనించి బిగ్గరగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారి సహాయంతో పోలీసులకు సమాచారం అందించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్చురీ గది వద్ద డీఎస్పీ మహేంద్ర, సీఐ కళా వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతిపై సందేహాలు ఉండడంతో అవ్వ సుగుణమ్మ ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతికి ప్రేమ వ్యవహారం కారణమా...? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఐదుగురు నిందితులకు జైలు శిక్ష


జైలు శిక్ష విధించిన ఐదుగురు ముద్దాయిలు

సిద్దవటం : దొంగనోట్ల మార్పిడి కేసులో ఐదుగురు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బద్వేల్ జడ్జి పద్మశ్రీ మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామ పంచాయతీలోని సాయి వైన్స్ షాపులో 2010లో కర్నూలు జిల్లా బనగానపల్లికి చెందిన యు.మాధవరెడ్డి, ఎం.షర్ఫుద్దీన్, టి.వెంకటేశ్వర్లు, ఎస్.అల్తాఫ్, ఎస్.హుస్సేన్‌వల్లి వేయి రూపాయల దొంగనోటు ఇచ్చి చెలామణి చేశారు. వైన్ షాపు క్యాషియర్ జయ నరసింహులు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బొజ్జప్ప కేసు నమోదు చేయగా ఒంటిమిట్ట సీఐ రవిబాబు విచారణ చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేయగా సదరు కేసు బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి వై పద్మశ్రీ విచారించి ఒక్కొక్కరికి ఏడు సంవత్సరాల సాధారణ జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరిపై నేరం రుజువు కానందున కేసు కొట్టి వేయడం జరిగిందన్నారు. సాక్షాధారాలతో నేరం రుజువు చేసి ఐదుగురికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

చిత్తూరు, అనంతపురం జట్ల భారీ స్కోరు


కనిష్(5 వికెట్లు)


నిఖిల్‌గౌడ్(153 పరుగులు)


మహేంద్రారెడ్డి(239)


వికాస్(109 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లో రెండో రోజున చిత్తూరు, అనంతపురం జట్లు భారీ స్కోర్లు చేశాయి. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో 375 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 103.3 ఓవర్లలో 454 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిత్ గౌడ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 22 ఫోర్లతో 153, బాలాజీ 59 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని కనిష్ చక్కటి లైనప్‌తో బౌలింగ్ చేసి ఐదు, సాయి సూర్యతేజరెడ్డి రెండు, అక్షిత్‌రెడ్డి రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 68 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 218 పరుగులు చేసింది. ఆ జట్టులోని నయిముల్లా 46, ధనుష్ నాయుడు 46 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని బ్రహ్మసాయి తేజ్‌రెడ్డి మూడు వికెట్లు తీశాడు. కర్నూలు జట్టు ఇంకా 236 పరుగుల వెనుకంజలో ఉంది. దీంతో రెండో రోజు ఆట ముగిసింది.

వైఎస్సార్ ఏసీఏ స్టేడియంలో......

వైఎస్సార్ ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 364 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 150.3 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 537 పరుగులకు డిక్లేర్డ్ చేసింది. ఆ జట్టులోని మహేంద్రారెడ్డి 30 ఫోర్లతో అద్భుతంగా చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ చేసి 239, వికాస్ 109 పరుగులు చేశాడు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ మూడు, నరసింహ రెండు, చెన్నారెడ్డి రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కడప జట్టు 29 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. ఆ జట్టులోని విజయరామిరెడ్డి 59 పరుగులు, భరత్‌రెడ్డి 40 పరుగులు చేశారు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

వరి రైతు విలవిల..


తెగుళ్లతో తెల్లబారిన వరిపంట

రాయచోటి : వర్షాకాలంలో తెగుళ్లతో వరి రైతు నష్టపోతున్నాడు. ఇప్పటికే యూరియా బస్తాల కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు ఇపుడు తమ వరి పైరుకు తెగుళ్లు సోకడంతో లబోదిబోమంటున్నారు. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో మార్పులకు వరి పంటకు కంకినల్లి, దోమ, ఆకు ఎండుతెగుళ్లు సోకాయి. వరి కర్రలు ఎర్రబారిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు 11432 హెక్టార్లకుగానూ, లోటు వర్షపాతం కారణంగా ప్రస్తుతం 4154 హెక్టార్లలో వరి సాగు చేశారు. 11 వేల ఎకరాలలో టమాట, 5వేల ఎకరాల్లో వంగ, మిరప పంటలు సాగుచేశారు. ఈ సారి వరిపంటకు తెగుళ్ల బెడద తీవ్రమైంది. వెలిగల్లు, పింఛా ప్రాజెక్టు క్రింద ఆయకట్టు, మదనపల్లి వాయల్పాడు, పీలేరు ప్రాంతాలలో చెరువుల కింద కొంత మేర, బావులు, బోరుబావుల్లో నీరు ఉన్న రైతులు వరిసాగు చేశారు. వరిపొట్ట దశకు వస్తుండటంతో క్రిమి కీటకాలు ఎక్కువయ్యాయి. కంకినల్లి, దోమ, ఆకు, ఎండు తెగుళ్లకు రైతులు మందులను పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే దున్నడానికి, నాటు వేయడానికి ఎరువులకు పెట్టుబడి పెట్టి సతమతమవుతుంటే కొత్తగా తెగుళ్లు రావడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

వరికి తెగుళ్లు సోకాయి.....

వరికి దోమ, కంకినల్లి, ఆకు ఎండుతెగుళ్లు సోకాయి. మందులను ఇప్పటికే పిచికారీ చేశాం. వాతావరణ మార్పులతో వరి పొట్ట దశలో ఉండగా రోగాలు వస్తున్నాయి. పెట్టుబడులు తడిసి మోపడయ్యాయి. దీనికి తోడు యూరియా దొరకడం లేదు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– బాలకృష్ణారెడ్డి, రైతు, పెద్దకాలవపల్లి